వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 11 ఆగష్టు 2024


## భక్తులు వెళ్లాల పుణ్యక్షేత్రానికి కాలిబాట

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని ప్రొద్దుటూరు నుంచి భక్తులు కాలిబాటన వెళ్లాల సంజీవరాయ స్వామి దేవస్థానానికి వెళ్లి దర్శణాలు చేసుకున్నారు. దర్శణాలకు వెళ్లిన భక్త బృందంలో దశమందం బ్రదర్స్, కేవిబి ప్రవీణ్‌కుమార్, మేఘనాధ్ తదితరులు పాల్గొన్నారు.



## దోమలు బాబోయ్ దోమలు

**రాయచోటి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉండడం వల్ల ఆ ప్రాంత ప్రజలు దోమలు బాబోయ్ దోమలంటూ వాపోతున్నారు. ఎక్కడ చూసినా మురికి నీటి కాలువలు, మురికి నీరు నిల్వ చేరి ఎక్కడ పడితే అక్క కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు అడ్డుపడి మురుగు నీరు కాలువల్లో ఎటూ వెళ్లక దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల దోమలు కుట్టి విష జ్వరాలు కూడా వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎక్కువగా జగదాంబా సెంటర్, కొత్తపేట, రామాపురం నాలుగు కుళాయిలు చంర్చి వీధి, తొగటవీధి, ప్రకాష్‌నగర్, వీఆర్ సందు ఇలా పలు చోట్ల దోమలు ఎక్కువగా ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు తగు చర్యలు తీసుకొని ఫాగింగ్ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బందిని వివరణ కోరగా ఫాగింగ్ చేయడమే కాకుండా అక్కడక్కడ బ్లీచింగ్ కూడా చల్లుతున్నామన్నారు.

# విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

### ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, ఆదినారాయణ రెడ్డి





**ప్రొద్దుటూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడ ఎంతో అవసరమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిలు పేర్కొన్నారు. ఈ నెల 10, 11వ తేదీలలో విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూ ఢిల్లీకి అనుబంధమైన సరస్వతి విద్యా మందిర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంతపురం సమితి స్థాయి ఖేల్ ఖుద్ ఆటల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ విధ్యార్థులకు చదువుతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంచే దిశగా ఆటల పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. విధ్యార్థుల శారీరక వికాసానికి జాతీయ క్రీడల్లో నైపుణ్యం పెంపొదించేందుకు ప్రతి సంవత్సరం పాఠశాల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఆటల పోటీలు నిర్వహించడం సరస్వతి విద్యా మందిర్ విద్యాసంస్థలకే దక్కిందన్నారు. ప్రధానంగా ఈ విశ్వవిద్యాలయాలలో బాల బాలికలకు చక్కటి చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, శారీరక యోగ సంగీతం, సంస్కృతి నైతిక ఆధ్యాత్మిక విద్యను అందించి విధ్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నారన్నారు. సమితి స్థాయిలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయిలో రాణించాలని వారు అభిప్రాయపడ్డారు. శ్రీ సరస్వతి విద్యా పీఠం అనంతపురం సమితి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే దేశభక్తి పూరితులైన యువతి యువకులను నిర్మాణం చేసే లక్ష్యంతో విద్యా భారత దేశవ్యాప్తంగా విద్యామందిరాలను నిర్వహిస్తుందన్నారు. దేశం మొత్తంలో 28 వేల పాఠశాలల ద్వారా 35లక్షల మంది విధ్యార్థులు జాతీయ విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ విద్యాలయాలలో చదువుతో పాటు క్రీడని నైపుణ్యం పెంపొందించే దిశగా ప్రతి సంవత్సరం సమితి, రాష్ట్ర, క్షేత్ర మరియు జాతీయస్థాయిలో ఆటల పోటీలను నిర్వహిస్తామన్నారు. బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు కర్నాలి ఎల్లారెడ్డి మాట్లాడుతూ శని, ఆదివారాల్లో నిర్వహించే క్రీడా పోటీలలో నాలుగు ఉమ్మడి జిల్లాల నుండి 72పాఠశాలలోని 800మంది విధ్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులోని శ్రీ సరస్వతి విద్యామందిర్‌లకు చెందిన రెండు బ్రాంచ్‌లలో నిర్వహించే సుమారు 30రకాల ఆటల పోటీలలో విజేతలకు అదే రోజు సాయంత్రం బహుమతులను ప్రధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సరస్వతి విద్యా మందిర్ కరస్పాండెంట్ రామచంద్రయ్య, కేశవరెడ్డి, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**బద్వేలు, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**



శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని నియోజకవర్గంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో లోని స్వయంభు లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి,అమ్మవార్లను అలంకరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పూజారి తీర్థప్రసాదాలు అందించారు. ఎన్నో సమస్యలతో వచ్చిన తమకు స్వామి వారి దర్శనంతో పరిష్కారమవుతున్నాయని పలువురు భక్తులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలాగే కోరిన కోర్కెలు నెరవేరుతున్నాయని, స్వామిని దర్శించుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుర్రంపాటి పెద్దయ్య గారి వెంకటరెడ్డి, సతీమణి వెంకటమ్మ, కుమారుడు చిన్నపురెడ్డిలు సహకరించారు.



# ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం -కలెక్టర్, ఎమ్మెల్యే

**దువ్వూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని చల్లబసాయిపల్లె రిజర్వాయర్-1 నుండి ఎస్సార్-2కు కృష్ణా జలాలు విడుదల చేయడంతో పాటు త్రాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె సమీపంలో తెలుగు గంగ ఉప జలాశయం-1 నుండి రెండుకు జలహారతి ఇచ్చి నీటిని విడుదల చేశారు. ఈ సంధర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తెలుగు గంగ ప్రాజెక్టులో భాగంగా ఉన్న రిజర్వాయర్-1కు శ్రీశైలం నుండి వెలుగోడుకు వెలుగోడు నుండి ఇక్కడికి నీరు రావడం జరిగిందన్నారు. జిల్లాకు చేరిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చి స్వాగతం పలకడం సుభదాయకం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ప్రకృతి నుండి మనకు అందే ఏ వనరును అయిన వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. వైఎస్సార్ జిల్లాకు అవసరమైన నీరు పుష్కలంగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అధిక వర్షాల వల్ల పూర్తి స్థాయిలో శ్రీశైలం వరకు అక్కడి నుండి వెలుగోడు ప్రాజెక్టుకు ఆ ప్రాజెక్టు ద్వారా తెలుగు గంగకు నీరు వదలడంతో బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు నీరు నిల్వ చేయడం జరుగుతుందన్నారు. ఈ నీటి ప్రవాహం 60రోజుల్లో పూర్తి అవుతుందని జిల్లాలో సుమారు 95వేల ఎకరాల్లో సాగునీరు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఆయకట్టు రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మైనర్ మరమ్మత్తులకు గాను స్థానిక నిధుల నుండి 10లక్షల రూపాయలు మంజూరు చేయబడుతుందన్నారు. పూర్తి స్థాయిలో బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ చూపడం జరిగిందన్నారు. దువ్వూరు ఆయకట్టు కింద పలు చెరువులు ఉన్నాయని ఆ చెరువులను కూడ నింపుకునే కార్యక్రమాన్ని ఈ రోజు నిటిని విడదల చేశామన్నారు. కృష్ణా జలాల రాకతో ఈ ప్రాంతం సశ్యశ్యామలం అవుతుందన్నారు. ఈ సంధర్భంగా దువ్వూరు మండలంలోని చింతకుట చెరువుకు చెన్నముక్కిపల్లె హెడ్ రెగ్యులేటర్ ద్వారా బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ సీఈ మల్లికార్జున రెడ్డి, ఎస్ఈ వెంకటరామిరెడ్డి, దువ్వూరు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బోరెడ్డి వెంకటరమనారెడ్డి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## పల్లేటి కులశేఖర్ మరణం

# తెలుగు నాటకరంగానికి తీరని లోటు

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



రైల్వేకోడూరుకు చెందిన సుప్రసిద్ధ నాటక రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి, కళారత్న పల్లేటి కులశేఖర్ మృతి తెలుగు నాటక రంగానికి తీరని లోటు అని కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం ప్రకటించారు. శుక్రవారం రాత్రి 10గంటలకు గుండెపోటుతో మరణించిన వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. కులశేఖర్ సాహిత్యంలోని అన్ని ప్రక్రియలో రచనలు చేశారని 66నాటకాలను రచించి పది సార్లు ఉత్తమ రచయితగా నంది అవార్డులను పొంది తాను రచించిన నాటకాలకు 88మంది నంది అవార్డులను కైవసం చేసుకున్నారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కులశేఖర్ ఆరు మంది ముఖ్యమంత్రుల చే సత్కారం పొందారు. రేడియో, టీవీ, సినిమా రంగాలలో అపురూపమైన ప్రతిభను కనబరిచిన పల్లేటికులశేఖర్ మన జిల్లా వారు కావడం మనకు గర్వకారణం అని ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

## 27 మందిపై పిచ్చికుక్క దాడి

**రాయచోటి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



రాయచోటి బస్టాండు సమీపంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో ముగ్గురు చిన్నారులు సహా సుమారు 27 మందిని గాయపరిచినట్లు బాధితులు వాపోయారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**డాక్టర్ సలహా.. కుక్క కరిస్తే ఏం చేయాలి?**

ధారగా పడుతున్న నీటితో 15 నిమిషాలు గాయాన్ని కడగాలి. ఇలా చేస్తే కుక్క లాలాజలం శరీరంలోకి ప్రవేశంచదు. గాయమైన చోటు యాంటి సెప్టిక్ లోషన్‌తో శుభ్రం చేయాలి. ఆ తరువాత డాక్టరు దగ్గరికి వెళ్లి టీటీ ఇంజక్షన్ వేయించాలి. కరిచిన చోట మూసి ఉంచొద్దు. నీరు, రక్తం కారుతున్నా అలాగే వదిలేయాలి. వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ టీకాను అవసరమైన (3 లేదా 5) మోతాదుల్లో తీసుకోవాలి.



# అంతర్జాతీయ క్రీడాకారునికి సన్మానం

**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తలారి నరసింహారావును ఎస్టీ నాయకుల మరియు ఉపాధ్యాయులు రాజారెడ్డి, నటరాజాలు సన్మానించి రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన రీజనల్ కార్వయర్గ సమావేశంలో జరిగిన రీజనల్ కార్యవర్గ సమావేవంలో నరసింహారావును ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు తయారు కావడం మనందరికీ గర్వాకారణమన్నారు. ప్రస్తుత రోజులలో సినిమాలు మొబైల్స్, షికార్లతో కాలం వెళ్ల దీస్తున్న నేటి యువత నరసింహారావును ఆదర్శంగా తీసుకుని దేశానికి మంచి పేరు తేవాలన్నారు. త్వరలో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ వాలీబాల్ పోటీలలో పాల్గొనేందుకు తోడాల్పటుగా ఆర్థిక సహాయం అందించి రాజారెడ్డి, నటరాజలు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీవీరభద్రస్వామి వారికి బంగారు మీసం, కళ్లు బహూకరణ



**రాయచోటి, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి రాయచూరుకు చెందిన శ్రీమతి అనసూయ ఎస్.హిరేమట్ కేరాఫ్ మల్లినాథ్ ఎస్ హిపేమట్ అడ్వకేట్ వారు రూ.3,23,424 విలువ గల 44 గ్రాములు, 920 మిల్లీ గ్రాములు బరువు గల బంగారు మీసం ఒకటి, బంగారు కళ్లు (2) స్వామి వారికి బహూకరించారు. ఈ సందర్భంగా శనివారం వారు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.రమణారెడ్డికి, ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి వారి చేతుల మీదుగా ఈవోకు అందజేశారు. ఈవో బంగారు వస్తువుల రసీదును భక్తులకు అందజేశారు.

# పాఠశాలల అభివృద్ధేయంగా చైర్మన్లు కృషిచేయాలి



**బద్వేలు అర్బన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

బద్వేలు పట్టణంలో పలు ప్రభుత్వ పాఠశాలలు అన్ని విధాలుగా అబివృద్ధి చేసేలా విద్యాకమిటి చైర్మన్‌లు, వైస్‌చైర్మన్లు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యాకమిటి చైర్మన్‌గా పోకల నరసింహారెడ్డి, వైస్ చైర్మన్‌గా లక్ష్మిదేవిలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిల సహకారంతో నూతన కమిటీగా ఏర్పడిన సందర్బంగా ఇరువురిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిలు మాట్లాడుతూ పాఠశాల విద్యాకమిటి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన విద్యాకమిటి చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ప్రతి ఒక్కరూ కూడా పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని అలాగే పాఠశాలలకు రాని పిల్లలు ఎవరైనా ఉంటే వారిని పాఠశాలలో చేర్పిం చేవిధంగా కృషిచేయాలని, పేద విద్యార్థుల విద్యాసామాగ్రి అందిస్తూ వారు చదువుకునేందుకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. నిరంతరాయంగా పాఠశాలలను పర్యవేక్షిస్తూ అక్కడి లోటుపాట్లను గమనిస్తూ వాటిని సరిచేసుకోవాలని, అలాగే విద్యార్థుల హాజరును చూసుకోవడంతో పాటు పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి వాటి పరిష్కారానికి కృషిచేసి పార్టీకి మంచి పేరుతీసుకురావాలన్నారు. అనంతరం విద్యాకమిటి చైర్మన్ పోకల నరసింహారెడ్డి, వైస్‌చైర్మన్ కొర్రులక్ష్మిదేవిలు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తమవంతు తోడ్పాటునందించడంతో పాటు పాఠశాల అభివృద్ధేలక్ష్యంగా విద్యార్థుల అభివృద్ధికి పాటుపడతామన్నారు. అలాగే తమపై నమ్మకంతో తమకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్‌రెడ్డిలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంగళరెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, బెనర్జీ, నాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పెద్దమండ్యం తహసీల్దార్‌గా సయ్యద్‌అహమ్మద్



పెద్దమండ్యం ఆగస్టు 10 ప్రభాతవార్త

పెద్దమండ్యం తాహసీల్దార్‌గా సయ్యద్‌అహమ్మద్ శనివారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇటీవల కలికిరిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై పెద్దమండ్యంకు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలకు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమై ప్రస్తుతం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకొండ గంగమ్మ అమ్మవారికి వెండి కవచం, పాదాలు, హస్తాలు



పెండ్లిమర్రి, ఆగస్టు 10, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామంలో వెలసిన శ్రీ కొండ గంగమ్మ దేవస్థానం వద్ద రూ.4.50లక్షలతో రేకుల షెడ్డును అలాగే, అమ్మవారికి రూ.2లక్షలతో 1.986 కేజీల వెండి కవచం, పాదాలు, హస్తాలు, కిరీటంను దాతలు కీ.శే.అక్కెనగుంట్ల పెద్ద గంగయ్య, ధర్మపత్ని కీ.శే.ఎ.వెంకటమ్మల కుమారుడు రిటైర్డ్ చీఫ్ ఇంజినీరు ఏసీ గంగయ్య, వీరి ధర్మపత్ని విజయగౌరి అందజేశారు.

## కలికిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రెడ్డిశేఖర్‌రెడ్డి



కలికిరి, ఆగస్టు 10, ప్రభాతవార్త:

కలికిరి పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రెడ్డిశేఖర్‌రెడ్డిని నియమిస్తూ అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. కలికిరి సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్.మోహన్‌ను అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో తిరుమల క్రైం పీఎస్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డిని కలికిరి పీఎస్ సీఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఆదివారం కలికిరి పీఎస్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఎస్సీ వర్గీకరణపై కలెక్టరుతో చర్చించిన జాకట విజయ శేఖర్



కడప వైద్యవిభాగం, ఆగస్టు 10, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర మాల మహానాడు గౌరవ రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం కడప జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టరు లోతేటి శివశంకర్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణ విషయంపై చర్చించడం జరిగింది. ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. భారతదేశంలో ఉన్న ఏ వ్యవస్థ అయినా భారత రాజ్యాంగాన్ని అనుసరించి నడుచుకోవాల్సిందే అన్నారు. క్రిమిలేయర్ అనే పద్ధతి ఓసీ, బీసీలకు వర్తిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వర్తింపబడిందన్నారు. ఎందుకంటే ఎస్సీ, ఎస్టీలలో అంటరానితనం కుల వివక్షత జీవితకాలం వెంటాడుతోందన్నారు. అగ్రవర్ణ వ్యవస్థ దళితులలో ఏ స్థాయి ఉద్యోగులైనా వ్యాపారులైనా దళితులను అవమాన పరుస్తూ హేళన చేస్తూ ఉంటారు కాబట్టి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని కలెక్టరుకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్, రాయలసీమ అధ్యక్షులు జేష్ఠాది భాస్కర, కడప నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యరాజ్, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు దీపక్, పోతు బోయిన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 12న తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా

మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

తహశీల్దార్ కార్యాలయం వద్ద 12న సోమవారం సిపిఐచే ధర్నా చేపట్టనున్నట్లు రాష్ట్ర సమితీ సభ్యులు తోపు క్రిష్ణప్ప పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ కార్యాలయం నందు మండల సమావేశం అంజనప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణప్ప మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు సంబంధించి ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మిగుల భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. పేద ప్రజలు ఈ ధర్నా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రా, ఎల్లప్ప, ఉత్తన్న, వెంకటరమణ, శివప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముదివేడు ఎస్ఐగా దిలీప్‌కుమార్

కురబలకోట, ఆగస్టు 10 ప్రభాతవార్త :

ముదివేడు ఎస్ఐగా దిలీప్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీలేరు అర్బన్‌లో పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌ను ముదివేడుకు బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డిని పీలేరు అర్బన్‌కు బదిలీ అయ్యారు.

## ఘనంగా యూటిఎఫ్ ఆవిర్బావ దినోత్సవం



మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

మదనపల్లె ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం యూటిఎఫ్ ఆవిర్బావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు, జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. యూటిఎఫ్ చేపటిటన ఉద్యమాల ప్రస్తుతం చేపట్టవలసిన ఉద్యమాలపై, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తీసునకోవాల్సిన చర్యలు గురించి ఈ సందర్భంగా వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూటిఎప్ నాయకులు గురు నారాయణచార్యులు, గాలి రవీంద్ర, ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పురం రమణ డివిజన్ కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రవిప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు హేమలత తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కావిళ్ళ పండగ



రామసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త :

మండల కేంద్రం, పెద్దకురప్పల్లె పంచాయితీలోని తిరుమలరెడ్డివారిపల్లె గ్రామవాసులు శనివారం భక్తిశ్రద్దలతో కావిళ్ళ పండగను రామసముద్రంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గ్రామస్థులు ఉపవాసదీక్షతో సుబ్రమణ్యం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు వస్త్రాలు దరించి కావిళ్ళను పూజించి వాయిద్యాల నడుమ హరోం, హర అంటూ స్వామిని పూజించి తమిళనాడులోని తిరుత్తనికి బయలుదేరి వెళ్ళారు.

# పంద్రాగస్టు వేడుకలు పండగలా చేద్దాం

- పట్టణంలో మూడురోజులు పాటు వేడుకలు -కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండగలా నిర్వహిద్దామంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో 15న జరిపే స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు సంబంధించి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ముందస్తుగా మూడురోజులుపాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరుపుదామన్నారు. దేశంలోనే ఎంతో చరిత్ర కలిగిన మదనపల్లెలోనే జాతీయ గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ ఇక్కడే అనువదించడం జరిగిందన్నారు. హోమ్ రూల్ ఉద్యమానికి వేదిక అయ్యిందన్నారు. ప్రపంచ తత్వవేత్త జిడ్డు క్రిష్ణమూర్తి పుట్టిననేల, మహాత్మగాంధీ నడియాడిన నేల, అనీబిసెంట్ విద్యాసంస్థ నెలకొల్పిన ప్రాంతంలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిపేందుకు అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల యాజమాన్యాలు, వ్యాపారులు, ఉద్యోగస్తులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు భాగస్వామ్యులై ఈ వేడుకలను ఘనంగా జరపాలన్నారు. ఈ వేడుకలకు సంబంధించి మూడురోజులు పాటు రోజుకొక్క కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణమంతా సుందరీకరణ చేసి 14న అర్థరాత్రి మిషన్‌కాంపౌండ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని బాణసంచాపేల్చుతూ జరుపుకోవడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు అందరూ విజయవంతానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, డిఎస్‌పి కొండయ్యానాయుడు, తహశీల్దార్ ఖాజాబీ, విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ గురుప్రసాద్, సేతు, కామకోటి ప్రసాద్‌రావు, రఘునాథ్‌రెడ్డి, పోలీసులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## మండల ఎస్ఐగా రవికుమార్

రామసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త :

మండల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జి.రవికుమార్‌ను బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన ఎస్ఐ చంద్రశేఖర్‌ను కర్నూల్ విఆర్‌కు బదిలీ చేశారు. నూతన ఎస్ఐగా రవికుమార్ బాధ్యతలుచేపట్టారు.

## గెవితిమ్మరాయునికి ప్రత్యేక పూజలు



రామసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త :

మండలంలోని దిన్నిపల్లె మోరుకొండలో వెలసిన గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ ఆధ్వర్యంలో అనీల్‌స్వామి శనివారం ఉదయమే స్వామివారికి వేదమంత్రాలతో ఆలయ శుద్ది స్వామివారిని ప్రత్యేకంగా పూజలు చేశారు. ప్రజల, భక్తులు క్యూ పద్దతిని పాటించడంతో ప్రత్యేకంగా స్వామిదర్శనం చేసుకొన్నారు. భక్తాదులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ పోలీస్ సబ్బంది బందోబస్తు నిర్వహంచారు.

## మిట్స్ విద్యార్థి స్వాతంత్ర్య వేడుకలకు ఎంపిక



కురబలకోట, ఆగస్టు 10 ప్రభాతవార్త :

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించే వేడుకల్లో మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న లోహితారెడ్డి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ కఠినమైనదని, క్యాడెట్లు వారి శారీరక దృఢత్వం డ్రిల్ నైపుణ్యం నాయకత్వ లక్షణాలతో ఎంపిక చేసినట్లు ఆయన తెలపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ వేడుకల్లో అంకితభావం, క్రమశిక్షణ, దేశభక్తిని ప్రదర్శిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఈడి కీర్తి నాదేల్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు అభినందించారు.

## ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోండి : ఏఐఎస్ఎఫ్



మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రైవేటు కళాశాలలకు వెళ్ళి కళాశాల యాజమాన్యాలతో మాట్లాడారు. సెలువు రోజుల్లో కళాశాలలు నిర్వమిస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం



పీలేరు, ఆగస్టు 10 ప్రభాతవార్తః

నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో వెలసిన శ్రీపట్టాభిరాముని ఆలయంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలలో రెండవ రోజు శనివారం శ్రీసీతారాముల వారికి శాంతి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. అనంతరం అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాలు అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ఊంజల్ మండపంలో స్వామివార్లకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్నపన తిరుమంజనం సేవను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో ఆస్థానమండపంలో విశేషంగా అలంకరించి మండపానికి తీసుకెళ్లి అధిరోహింప చేసి వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శాంతి కళ్యాణం నిర్వహించారు. రాత్రి హనుమంతునిపై అధిరోహించి తిరుమాడ వీధులలో విహరించారు. భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పీలేరు, ఆగస్టు 10 ప్రభాతవార్తః

యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తిచేసుకుని 51 వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా యూటీఎఫ్ నాయకులు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతరం పోరాటాలు చేసే సంఘం యూటీఎఫ్ అని కొనియాడారు. పాఠశాలలలో పిల్లల అభివద్దికి నిరంతరం కషిచేసే ఏకైక యూటీఎప్ అని రాష్ట్ర నాయకులు తెలియజేశారు. పోరాట ఫలితంగా నేడు ప్రశాంతమైన జీవనానికి విలువలతో కూడిన జీవనానికి ఎంతో మంది త్యాగాల ఫలితంగా మనం నేడు జీవిస్తున్నామని హక్కులను బాధ్యతలను రెండు కళ్లుగా చూసేటువంటి సమస్య మందని దీని ఉన్నతికి మనమందరం పాటుపడాలని సమావేశంలో పాల్గొన్న సీనియర్ నాయకులు రాధాకష్ణ అన్నారు. ప్రభుత్వాలు ఇవ్వలసిన గౌరవం ఇస్తూ వారి యొక్క సంక్షేమాన్ని కూడా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని ఉపాధ్యాయులు పాఠశాలలను పరిరక్షించుకోవాలని యూట్యూబ్ నాయకులు శివారెడ్డి, ఉపాధ్యాయులను కోరారు. ఎందరో త్యాగ ఫలితంగా ఉద్యోగులు వారి యొక్క విధులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పాఠశాల అభివద్దికి కసిచేయాలని జిల్లా నాయకులు కోరారు. సమావేశంలో మహేంద్ర, సుధాకర్, సుబ్రమణ్యం, కష్ణమూర్తి, సుధాకర్, చెంగల్ రాయులు, రమణయ్య, రమేష్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, నారాయణనాయుడు, రమణయ్య, దేవేందర్‌రెడ్డి, రహంతుల్లా పాల్గొన్నారు.



## ఎస్పీని కలిసిన బిజెపి నేతలు



రాజంపేట అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గల్ఫ్ దేశాలకు వెల్లి పలు ఇబ్బందులు పడుతున్న బాధితులను కాపాడాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్‌తో పాటు పార్టీ నాయకులతో కలిసి ఎస్పీని కలిశారు. ఇటివల కాలంలో పలువురు ఏజెంట్ల మోసాలతో ఇబ్బందులు పడి అతి కష్టం మీద స్వదేశానికి వచ్చారని వివరించారు. వీరి వెంట బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణాయాదవ్, షబ్బీర్ అహ్మద్, మహేష్ రాజు ఉన్నారు.

## రాంనగర్ కొండపై శ్రీవారికి ప్రత్యేక పూజలు



రాజంపేట అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

రాజంపేట పట్టణం రాంనగర్ కొండపై వెలసిన తిరుమల గిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచి స్వామికి అభిషేకాలను నిర్వహించారు. పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి మూల విరాట్‌కు నిలువెత్తు పూలమాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చలపతితో పాటు కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రాజంపేట అర్బన్ ఎస్ఐలు బదిలీ

రాజంపేట అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:

రాజంపేట అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మోహనకుమార్ గౌడ్‌ను పుల్లంపేటకు బదిలీ చేశారు. మరో ఎస్ఐ వెంకటేశ్వర్లును రాయచోటి డిఎస్‌బికి బదిలీ చేశారు. రాజంపేటకు లక్ష్మిప్రసాద్ రెడ్డి నంద్యాల టూటౌన్ నుంచి నవీన్‌ను బదిలీ చేశారు.

## అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారం అందుకున్న గౌస్‌బాషా

పీలేరు, ఆగస్టు 10 ప్రభాతవార్తః

అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారానికి స్క్రిప్టు రైటర్ షేక్‌గౌస్‌బాషా పురస్కార ప్రధానోత్సవ నిర్వాహకురాలు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ సింగర్, హీరోయిన్, ఫైజన్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ కష్ణమనోహర్ చేతుల నుంచి శనివారం హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన అల్లూరి సీతారామరాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈలెజెండరీ పురస్కారం అందుకున్నారు. ఈఅవార్డు రచయిత, నటన, దర్శకత్వం సామాజిక కర్తగా పిచ్చి డాక్టర్, విరోధి, ఆదర్శ విద్యార్థులు, గందరగోళం, విరోధి, నిరుద్యోగి, మట్టిలో మాణిక్యం, బుర్రకథలు, అడవిలో అన్నలు తొలిరోజు లాంటి కథనాలకు 27 సంవత్సరాలు తరువాత ఈఅవార్డు రావడం సంతోషమైందన్నారు. ఇలాంటి అవార్డులు మరెన్నో రావాలని సన్నిహితులు కోరుతున్నారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, శ్రీ కృష్ణాలయ యాదవ సేవా కమిటి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా నిరాశ్రయులకు, పాదాచారులకు, ప్రయాణికులకు, నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ అన్నదానంలో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ కడుపునిండా భోజనం ఆరగించి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా ప్రొద్దుటూరు పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయులని పలువురు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఎంతోమంది నిరుపేదల వివాహాలకు భోజనం ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, సీతంపల్లి రమణ, బోడెం ప్రసాద్, బంగి శివ, యేసునాధ రెడ్డి, జయచంద్ర యాదవ్, నల్లం రవిశంకర్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన రాములోరి విగ్రహ ప్రతిష్ట కల్యాణం



రామాపురం, ఆగస్టు 10, ప్రభాతవార్త:

మండలంలోని కల్పనాయుని చెరువు గ్రామం అగ్రహారంలో గత 3 రోజులుగా నిర్వహించిన హనుమాన్ సమేత శ్రీ సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం ఘనంగా ముగిసింది. అనంతరం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా ముగిసింది. శుక్రవారం మూలవిరాట్ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా చేశారు. ఎర్రని నరసింహులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దాతగా ఆ గ్రామానికి హనుమాన్ సీతారాముల ధ్వజస్తంభం విగ్రహ ప్రతిష్ట సీతా రాముల గ్రామోత్సవాలు చేశారు. వేద పండితులతో విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు.

## రాష్ట్రష మంత్రి నారాయణను కలిసిన తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం బృందం



రామాపురం, ఆగస్టు 10, ప్రభాతవార్త:

రాష్ట్ర పురపాలక శాఖామంత్రి నారాయణను అన్నమయ్య జిల్లా రామాపురం మండలం తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం బృందం శనివారం నెల్లూరులోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు అన్నమయ్య జిల్లా రామాపురం మండలం తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం బృందం, పిచ్చిరెడ్డి రామచంద్ర, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం, సుధాకర్, మనోహర్‌రెడ్డి, పీడీ రామచంద్రలు కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో నెంబరు 117ను రద్దు చేయాలని పాఠశాల నిర్వహణ నిధులను సకాలంలో వచ్చే విధంగా చూడాలని వారు మంత్రికి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యాయ సంఘం బృందం పిచ్చిరెడ్డి రామచంద్ర, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం, సుధాకర్, మనోహర్‌రెడ్డి, పీడీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం



చిన్నమండెం, ఆగస్టు 10, ప్రభాతవార్త :

చిన్నమండెం మండలం వండాడి గ్రామం గాండ్లపల్లెలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కళ్యాణ మహోత్సవానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇంత వైభవంగా కళ్యాణమహోత్సవాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నీతి నిజాయితీ, ఐకమత్యం, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. దైవభక్తి వల్ల ప్రజల్లో వీర్షద్వేషాలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రావణ శనివారం వేడుకలు



గాలివీడు, ఆగస్టు 10(ప్రభాతవార్త):

మండల కేంద్రం స్థానిక బ్రాహ్మణవీధిలో కొలువైవున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ ఆచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామునే మూలవిరాట్‌మూర్తిని తులసీదళాలతో విశేషంగా అలంకరించారు. భక్తిశ్రద్దలతో స్వామి వారికి అభిషేకాలు, నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుంచే స్వామి వారి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. అర్చకులు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ శివకేశవులకు ప్రీతికరమైన మాసంలో ఆ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని నియమనిష్టలతో పూజించి ఆరాధిస్తే శని బాధలు తొలగిపోతాయన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

## గ్రామాభివృద్దిలో సర్పంచ్‌లే కీలకం - ఎమ్మెల్యే



మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

గ్రామాభివృద్దిలో సర్పంచ్‌లే కీలకమటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయితీ సెక్రటరీలు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు ఉండవన్నారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుద్ద్య నివారణకుచర్యలుచేపట్టాలన్నారు. గ్రామమంతా పరిశుభ్రంగా ఉంటేనే అంటు వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. సర్పంచ్‌లు గ్రామాభివృద్దికి శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమన్వయం చేసుకొని వర్షాకాలంలో వ్యాధులు ప్రభలకుండా చూడాల్సిన బాధ్యత సెక్రటరీలదే అన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి రోజూ ఫాగింగ్, క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రజా అవసరాల మేరకు గ్రామాల్లో అభివృద్ది పనులు కూడా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్దికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగు రెడ్డమ్మ, ఎంపిడిఓ భానుప్రసాద్, వైస్ ఎంపిపి వెంకటరమణ, ప్రత్యేక ఆహ్వానితులు వెలుగు చంద్రా, సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

## వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి



మదనపల్లె, ఆగస్టు 10 ప్రభాతవార్త :

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం సంతగేటు ఏఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా, మద్యాహ్నా భోజనం వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై గ్రామాల్లో రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, రాజకీయ కక్షలతో అక్రమంగా తొలగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా కక్షసాధింపులు మానుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వర్కర్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డప్ప, మురళీ, చలపతి, కదిరప్ప, రామచంద్ర, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యవర్గ సమావేశం



రామసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త :

రామసముద్రం మండల బిజెపి కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం కోసం ప్రతి ఇంటిమీద జాతీయ జెండా హార్‌ఘర్ తిరంగా అభియాన్‌లో ప్రతి ఇంటి మీ జాతీయ జెండా ఎగుర వేయాలని తెలిపారు. మండల అధ్యక్షులు ఇంజం ఆనంద్‌కుమార్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బిజెపి క్రిష్ణమూర్తి, మండల జనరల్ సెక్రటరీ శేఖర్, యువమోర్చా సుబ్రమణ్యం నాయుడు, వెంకటేష్, శివారెడ్డి, బాలాజి, మంజునాథ్, ఎమ్మార్పీఎస్ గంగాధర్, కొండప్ప, గంగాధర్, కిసాన్‌మోర్చా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రావణకాష్టంలా మారుతోన్న ఆంధ్రప్రదేశ్




**పులివెందుల రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త ః**

రాజకీయ కక్షలు, దౌర్జన్యాలతో ఆంధ్రప్రదేశ్ రావణకాష్టంగా మారుతోందని వైకాపా నాయకులు తెలిపారు. పులివెందులలోని అంబేద్కర్ విగ్రహానికి వైకాపా నాయకులు పాలాభిషేకంచేసి, నల్లరిబ్బన్ ధరించి శనివారం నిరసన తెలిపారు. విజయవాడ నగర నడిబొడ్డున కొందరు టీడీపీ దుండగులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుర్ఘటనపై వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి కూడా గౌరవించకుండా ధ్వంసం చేయడం, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందనడానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనరు హాల్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ హఫీజ్, రసూల్, జేసీఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, ఎస్సీ సెల్ నాయకులు కోళ్లభాస్కర్, కృష్ణమూర్తి, కౌన్సిలర్లు బొగ్గిటి పురుషోత్తం, ఖాదర్, పద్మనాభరెడ్డి, కొండయ్య, రాజేష్‌నాయుడు, ఎస్టీ నాయకులు నాగరాజు, బలిజ సంఘం నాయకులు గూడూరు గురుప్రసాద్, బ్యాటరీ ప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ యూత్ జశ్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హోంమంత్రిని కలిసిన గెస్ట్ ఫ్యాకల్టీ

**వేంపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త ః**



ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం రాష్ట్ర హోంమంత్రి అనితను కలిసి వినతిపత్రం సమర్పించారు. మేము నోటిఫికేషన్ ద్వారా పరీక్ష రాసి, ఇంటర్వ్యూకు హాజరై రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా ఎంపికయ్యామని వారు మంత్రికి వివరించారు. తమకు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి ఇచ్చారని, అయితే తమకు నెట్/సెట్ అర్హత లేకపోవడంతో మాకు గెస్ట్ ఫ్యాకల్టీ డెజిగ్నేషన్ ఇచ్చారన్నారు. మా తరువాత వచ్చిన వారికి రూ.33 వేలు వేతనం ఇస్తూ, తమకు రూ.25వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు రావల్సిన బెనిఫిట్స్ ఏమీ మాకు వర్తించడం లేదన్నారు. మా తరువాత చేరిన ఉద్యోగుల మాదిరే మాకు కూడా జీతం పెంపుదలతో పాటు అన్ని వసతులు కల్పించాలని వారు మంత్రిని కోరారు.

## అవుకు రిజర్వాయర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు



**జమ్మలమడుగు, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

అవుకు రిజర్వాయరుకు చేరుకున్న కృష్ణ జలాలకు హారతి ఇచ్చి అవుకు రిజర్వాయరు నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా గండికోట ప్రాజెక్టుకు నీటిని ఏపీ రోడ్డు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డిలు విడుదల చేశారు. జేసీ శ్రీమతి అదితి సింగ్, పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## పునీత ఫాతిమామాత పుణ్యక్షేత్ర ఆలయ శిలాఫలకం ఆవిష్కరణ



**బద్వేలు అర్బన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

బద్వేలు పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని పునీత ఫాతిమామాత పుణ్యక్షేత్ర ఆలయ శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని మహాఘనత వహించి కడప మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీ గాలిబాలి ముఖ్య అతిథిగా పాల్గొని వారి చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలువురు దాతల సహాయసహకారాలతో పునీత ఫాతిమా మాత పుణ్యక్షేత్ర చర్చి నిర్మాణానికై ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమవంతు తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం కడప డయాసిస్ సాంఘీక సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాదర్ తలారి బాలరాజు మట్లాడుతూ బద్వేలు పట్టణంలో ఫాతిమామాత చర్చి నిర్మాణం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప మేత్రాసన పీఠాధిపతులు శ్రీశ్రీ గాలిబాలి చేతుల మీదుగా శిలాఫలకం ఆవిష్కరించడం జరిగిందన్నార. అత్యంత వైభవంగా చర్చి నిర్మాణం చేపట్టి భక్తులకు అవసరమైన నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ నిర్మాణంలో ప్రతి ఒక క్రరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్చిల ఫాదర్లు పాల్గొన్నారు.

## మాధురి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్జేడీ

**సుండుపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం లోని మాధురి పాఠశాలను శనివారం ఆర్జేడీ శ్యా ముల్ సందర్శించారు. అక్కడ ఉన్న మౌలిక వసతులను, ఫీజుల వివరాలను పాఠశాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రవీం ద్ర నాయక్, పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ముబారక్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు

**కడప కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను కడప మేయర్ సురేష్‌బాబు పరిష్కరిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలియాస్ బి.హెచ్, సయ్యద్ అక్రం (యూఏఈ)లు కొనియాడారు. వీరి ఆద్వర్యంలో శనివారం కడపలో కడప మేయర్ సురేష్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ ప్రవాసాంధ్రులు అంటే ప్రత్యేక అభిమానం సామాన్య కార్యకరనతను కూడా గౌరవంతో పలకరించే మంచి మనసున్న నాయకుడు కె.సురేష్‌బాబు అని ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కురుకున్నారు. భవిష్యత్తులో రాజకీయాలలో ఉన్నత శిఖరాలు అధిష్టించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి,రామ్‌లక్ష్మణ్, సింధు, రాజా సాహెబ్,అన్సార్, బాబు భాయ్, షేక్ గయాజ్, పాల్గొన్నారు.

# గండి క్షేత్రంలో భక్తుల సందడి



**చక్రాయపేట,ఆగుష్టు 10,ప్రభాతవార్త:**

పుణ్య క్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు భక్తుల సందడి కినిపించింది తొలుత శ్రావణ మాస ఉత్సవాలు కావడంతో భక్తులు భారీగా క్షేత్రానికి తరలించారు మొదటి వారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా కనబడింది ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వీలైన్లో భారీగా భక్తుల రద్దీ కనబడింది వివిధ ప్రాంతా నుండి గండి క్షేత్రానికి విచ్చేసిన భక్తజనం ఆంజనేయస్వామి ముక్కులు తీర్చుకొని క్షేత్రంలోని తదితర దేవస్థానాలను దర్శించుకున్నారు.మొదటి వారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు ఒకసారిగా భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో క్యూలైన్లో సరిపోక భక్తులు ఎండలో బారులు తీసి నిలబడినారు మొదటివారం ఇంత జనం వచ్చేసరికి గండి క్షేత్రంలో ఏర్పాట్లు విషయంలో అధికారులు విఫలమైనట్లు భక్తులు పేర్కొంటున్నారు అనంతరం ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు అక్కడ భారీగా భక్తులు తరలివెళ్లి ఉచిత అన్నదానాన్ని భుజించారు దీంతోపాటు ఆలయ ప్రాంగణంలో మరింత దాతలు అన్నదాన్న సౌకర్యం ఏర్పాటు చేశారు దేవస్థానం ఎదురుగా రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం కాగా చాలా సమయం పాటు భక్తులు ఇబ్బందులు గురయ్యారు దీంతో అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు ఆలయ అధికారులు ముందస్తు జాగ్రత్త దేవుని ప్రసాదాలతో పాటు పులిహార ప్యాకెట్లను కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఈవో వెంకటసుబ్బయ్య ఛైర్మన్ కావలి కష్ణ తేజ ప్రధాన అర్చకులు కేసరి రాజా పోలీస్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అట్టహాసంగా శ్రీవాసవి అన్నదాన సత్రం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం



**వేంపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త ః**

చక్రాయపేట మండలంలోని గండి వీరాంజనేయస్వామి సన్నిధిలోని శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం 2024-27 నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర అధ్యక్షతన శనివారం అన్నదాన సత్రంలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగిందని, అన్నదాన సత్రం ప్రస్తుత అధ్యక్షుడు రాయవరం శివరావు తెలిపారు. అన్నసత్రం నూతన అధ్యక్షుడిగా పచ్చిపులుసు మురళికిషోర్, ఉపాధ్యక్షులుగా బైరిశెట్టి బాలగంగాధర్, పోలేపల్లె రామాంజనేయులు, పోలేపల్లె సుమన్, ప్రధాన కార్యదర్శిగా గోనుగుంట్ల హరికృష్ణ, కార్యదర్శులుగా పోలేపల్లె శివప్రసాద్, తోటంశెట్టి పుల్లయ్య, రాయవరం రవి, ఉప కార్యదర్శులుగా కామిశెట్టి సురేష్, జుటూరు పెద్ద రెడ్డెయ్య, కోఆర్డినేటరుగా మేడా శ్రీనివాసులు, ఆర్గనైజర్లుగా రాయవరం ద్వారకనాథ్, సగళా సత్యం, కార్యవర్గ సభ్యులుగా దొంతు నిరంజన్, మద్దాల రాధాకృష్ణయ్య, ఆర్గనైజర్లు, కోశాదికారులు, ఆర్థిక కమిటి సభ్యులు, సలహాదారులుగా మరికొందరు ప్రమాణస్వీకారం చేశారు. వారు మాట్లాడుతూ అన్నదాన సత్రం అభివృద్ధికి తమ వంతు కృషి చేసి సంఘానికి పేరు ప్రఖ్యాతలు తెస్తామని తెలిపారు.

## రాజీలేని పోరాటాలు యూటిఎఫ్‌కే సాధ్యం

**బద్వేలు అర్బన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**



రాజీలేని పోరాటాలు యూటిఎఫ్‌కే సాధ్యమని జిల్లా యూటిఎఫ్ అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్ పేర్కొన్నారు. యూటిఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవాన్ని పుస్కరించుకుని బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుళరెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదిన ఉపధ్యాయ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామి రెడ్డిల నేతృత్వంలో ఏర్పాటైన యూటిఎఫ్ నాటి నుంచి నేటి వరకు విద్యారంగ ఉపాధ్యాయుల సమస్య లపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు.ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యా యుల సంక్షేమమే లక్ష్యంగా గడిచిన 50 ఏళ్లలో విద్యారంగానికి ఉపాధ్యాయులు ఎన్నో హక్కులను , సౌకర్యాలను సాధించిన ఘనత యూటిఎఫ్‌కే దక్కుతుందన్నారు. అలాగే అప్రెంటిస్ విధానం, రీ గ్రూపింగ్, స్కిల్స్ సాధన, ఉపాధ్యాయుల బదిలీలలో పారదర్శకమైన కౌన్సిలింగ్ విధానం, నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన వంటి వాటిని సాధించడంలో యూటిఎఫ్ పాత్ర గణనీయమైనద న్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందించేందుకు పభ్రుత్వ విద్యారంగాన్ని పరిరక్షించు కోవడమే ఏకైక లక్ష్యంగా యూటిఎఫ్ చేపట్టిన పోరాటాలు చారిత్రాత్మకమైనవన్నారు. అలాగే ప్రకృత వైపరీత్యాలు, కరువు కాటకాలు సంభవించినపుడు మరియు కరోనా సమయంలో ప్రజలను ఆదుకోవడంలో యూటిఎఫ్ కీలక పాత్ర పోషించి సమాజానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో యూటి ఎఫ్ జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు శివ ప్రసాద్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానం దం, సుధాకర్, ట్రెజరర్ గురయ్య, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరదాసరి క్రిష్టఫ ర్, కృష్ణుడు, ట్రెజరర్ రామచంద్రయ్య, అట్లూరు మండల అధ్యక్షులు కంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

**కడప కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మంత్రులతో టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి రోజు ఏర్పాటు చేయడం అభినందనీయమని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా, టీడీపీ ఆహ్వాన కమిటీ సభ్యుడు హసన్ బాషా పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్ వద్దకు ప్రజలను పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు ప్రభుత్వం నడుపుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న చంద్రబాబు కార్యకర్తల సమస్యలను తీర్చేందుకు ప్రతి రోజు ఒక్కొక్క మంత్రి ఆద్వర్యంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండడంతో కార్యకర్తల్లో మనోధైర్యం పెరిగి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటవుతాయన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలు, కార్యకర్తల నుంచి పార్టీ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్నారన్నారు.

## యూనివర్శిటీ టాపర్స్‌గా జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**జమ్మలమడుగు, ఆగస్టు 10, ప్రభాతవార్త:**




వైవీయూ విడుదల చేసిన 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్శిటీ టాపర్స్‌గా రావడం పట్ల జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జి.చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ విభాగంలో మాధవి 9.67, చందు 9.33, చాందిని 9.33, గౌరి మోహన్ 9.33, సౌజన్య 9.33, ప్రమీల తదితరులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ అభినందించారు. ఎకనామిక్స్ అధ్యాపకులు డా.సుధీర్‌రెడ్డి, బాబూరావు, వైస్ ప్రిన్సిపల్ డా.సంజీవరెడ్డి విద్యార్థులను అభినందనలు తెలిపారు.

## ఆంగ్లేయులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**



స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఆంగ్లేయుల గుండెలను దడదడ లాండించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని పెన్షన్ కార్యాలయం అధ్యక్షులు మీనాక్షిరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక పెన్షన్ కార్యాలలయంలోఅల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాట పటిమ పొందిన మహనీయులలో సీతారామరా జు ఒకరని అనానరు. అలాంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జరుపుకోవడం మన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.పుల్లయ్య, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాదికారి గంగన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్బరాయు డు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



**వేంపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త ః**

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా వేంపల్లె టీడీపీ నేతలు కలిశారు. శనివారం ఆత్మకూరులో ఉన్న మంత్రిని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి పి.వి.రమణ, దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, మాజీ వార్డు మెంబరు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి (ఎల్‌బిఆర్)లు కలిసి వృషభాచలేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలిపై చర్చించారు. వేంపల్లెలోని వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన పాలకమండలి పదవీ కాలం మూడు నెలల క్రితం పూర్తయిందని మంత్రి దృష్టికి టీడీపీ నేతలు తెచ్చారు. అప్పటి నుండి దేవస్థానంకు నూతన పాలకమండలి ఏర్పాటు కాలేదన్నారు. నూతన పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వాలని మంత్రిని కోరారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో నియమించిన గండి దేవస్థానంకు చెందిన పాలక మండలి సభ్యులు ఇంకా రాజీనామాలు చేయలేదని కూడా తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి త్వరలో గండి క్షేత్రాన్ని దర్శించి పాలకమండలిని రద్దుచేసి కొత్త పాలకమండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేస్తానని హామీఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అలాగే వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి కూడా కొత్త పాలకమండలి ఏర్పాటుకు కూడా నోటిఫికేషన్ ఇస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నేతలు భాస్కర్‌రెడ్డి, లింగాల గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మానవత ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత తాగునీరు



**వేంపల్లె, ఆగస్టు 10, ప్రభాతవార్త ః**

మానవ స్వచ్చంద సేవా సంస్థ ఆద్వర్యంలో భక్తులకు ఉచిత తాగునీటిని ఏర్పాటు చేశారు. శ్రావణమాసం శనివారల్లో గండి వీరాంజనేయస్వామి దేవస్థానానికి కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఉచిత తాగునీటి శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మానవత సంస్థ ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. తమ సేవాసంస్థ ద్వారా వివిధ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సహాయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ప్రతినిధులు ఓబుళరెడ్డి, చల్లా బాలాజి, మధు, శ్రీకళ, మణిగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



**దువ్వూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పీరు సాబ్ పల్లె నందు నూతనంగా నిర్మించిన శ్రీ ఏకశిల పట్టాభిరాముల విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలలో విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శనివారం శ్రీ ఏకశిల పట్టాభిరాముల విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, ధ్వజస్థంబ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వాహించామని నిర్వాహకులు తెలిపారు. అలాగే గ్రామంలో కోలాట బృందంచే ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటుచేశారు.

## సూప్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు



**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

సూప్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు చేస్తాని కాంగ్రెస్ నేతలు తులసిరెడ్డి, విజయజ్యోతి, అన్వర్‌లు ప్రశ్నించారు. శనివారం పోరుమామిళ్లలోని అన్వర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్-పథకాలు ప్రధాన కారణమని అధికారంలోకి వచ్చి 2 మాసాలు అయినప్పటికీ 6 పథకాలలో ఒక సామాజిక పథకం మాత్రమే అమలు అయిందని మిగతా 5 పథకాలు అమలు కాలదన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల, తల్లికి వందనం పతకం కింద స్కూలు వెళ్లే విద్యార్థికి రూ.15 వేలు, అన్నదాతకు సుఖీభవ పథకం కింద ఏటా 20వేలు ఆర్థిక సాయం, 19 నుంచి 59 సంవత్సరాలు గల ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, బీసీ,ఎస్సీ,ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అమలు కాలేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోందని ఇది మోసం కాదా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు ఈ విద్యాసంవత్సరంనుంచే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాష, సలీం, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.